సాక్షి
హనుమకొండ
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024

న్యూస్‌రీల్

నేడు సీఎం రాక



మడికొండ: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం నగరంలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా మడికొండలో నిర్వహిస్తున్న ప్రజాగర్జన సభకు ఆయన హాజరు కానున్నారు. మంగళవారం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీతో కలిసి హెలిప్యాడ్ సెంటర్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఈసందర్భంగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని, కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. మడికొండలో ప్రధాన సమస్య డంపింగ్ యార్డుపై సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



వరంగల్ క్రైం: ఆకస్మికంగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన రూ.7.89 లక్షల చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అందజేశారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.కుమార్ జనవరి 1న అనారోగ్యంతో మరణించాడు. తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మంజూరైన రూ.7.89 లక్షల చెక్కులను సీపీ చేతుల మీదుగా కుమార్ భార్య రమాదేవికి అందజేశారు. ఆకుటుంబానికి శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్లను అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్ పాల్గొన్నారు.

నేటి నుంచి పేరిణి నాట్యంలో శిక్షణ

హన్మకొండ కల్చరల్: వరంగల్ నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి నెలరోజుల పాటు పేరిణి నాట్యంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు అకాడమీ నాట్యాచార్యులు గజ్జెల రంజిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లో నాలుగు సెంటర్లలో ఉదయం 9గంటల నుంచి 10.30గంటల వరకు తరగతులు కొనసాగుతాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 93930 04755, 70138 25078 నంబర్‌ల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గ్రంథ చౌర్య నిబంధనలపై అవగాహన ఉండాలి..

కేయూ క్యాంపస్: పరిశోధకులకు గ్రంథ చౌర్య నిబంధనలపై అవగాహన ఉండాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి అన్నారు. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో వారం రోజుల వర్క్‌షాప్ మంగళవారం ముగిసింది. ముగింపు సమావేశానికి నర్సింహాచారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అని పరిశోధనలకు సంబంధించిన మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాగరిజం నిబంధనల నేపథ్యంలో పరిశోధకులు పరిశోధన పత్రాలను సిద్ధాంత గ్రంథాలకు సంబంధించి వనరులను ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలను ఆయన వివరించారు. పరిశోధకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆకళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఓఎస్ ఆచార్య కె.రాజేందర్, అధ్యాపకులు డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు బదిలీ

వరంగల్ లీగల్: సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు మంగళవారం బదిలీ అయ్యారు. ఈమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. జడ్జి శ్రీనివాసులును సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్ జడ్జి గోదావరిఖనికి బదిలీ చేస్తూ.. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా పని చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షమా దేశ్ పాండేను నియమిస్తూ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజరాజేశ్వరికి పుష్పార్చన



హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరి దేవాలయంలో మంగళవారం చైత్రమాసం శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని పుష్పార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు యెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో సాయంత్రం అమ్మవారికి ఎరుపు గులాబీ, మల్లెపూలతో అర్చన చేశారు. అనంతరం అన్నప్రసాదాల వితరణ చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

పవనసుత హనుమాన్‌కీ జై



హనుమాన్ జయంతి సందర్భంగా భజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నగరంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. రంగశాయిపేట మహంకాళి దేవాలయం వద్ద బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్, నాయకులతో కలిసి హిందూ ధర్మ ప్రచార కర్త రాధా మనోహర్ దాస్ జెండా ఊపి బైక్ ర్యాలీ, శోభాయాత్ర ప్రారంభించారు. యాత్ర ఉర్సు కరీమాబాద్ మీదుగా బట్టల బజార్, ఎంజీఎం జంక్షన్, ములుగు రోడ్డు, హనుమకొండ చౌరస్తా మీదుగా పద్మాక్షి దేవాలయం వరకు సాగింది. భక్తులు సిందూర వర్ణం తలపాగాలు ధరించి.. చేతిలో జెండా పట్టుకుని యాత్రలో పాల్గొన్నారు. - ఖిలా వరంగల్

నమ్మించి గొంతు కోసిన కడియం

- పార్ట్–1 మాదిరిగానే పార్ట్–2 సీక్వెల్‌గా కాంగ్రెస్ మోసాలు
- అక్షింతలతో ఓట్లు అడుగుతున్న మోదీ
- యాదాద్రి ఆలయం నిర్మించినా మేం అలా అడగలేదు
- ఎంపీ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి
- వరంగల్ పర్యటనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హనుమకొండలో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

సాక్షి, వరంగల్/ ఖిలా వరంగల్/హసన్‌పర్తి: 'బిడ్డకు ఎంపీ టికెట్ ఇస్తే సంతోషపడి నాకు ఫోన్ చేసి రామన్నా.. కేసీఆర్ సార్‌ను కలుద్దామని అంటే సిబ్బందికి చెప్పి సమయం ఇప్పించా. సకుటుంబ సపరివారంగా వెళ్లి గంటన్నరసేపు మాట్లాడారు. కడియం కావ్యేమో మా ఆయన ఆంధ్రా అయినా కేసీఆర్‌కు ఫ్యాన్ అయిపోయిండు అన్నారు. ఆ తర్వాత రాజీనామా చేస్తున్నామని వెళ్లిపోయారు. పార్టీలు మారుడు తప్పు కాదు. నమ్మించి గొంతు కోశాడు. అందర్నీ (ఆరూరి రమేశ్, పసునూరి దయాకర్) వెళ్లగొట్టడం బరాబర్ తప్పు అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. వరంగల్ ఉర్సుగుట్ట, హనుమకొండలో మంగళవారం సాయంత్రం జరిగిన పార్టీ వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల విస్తృతస్థాయి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. శ్రీహరికి పదేళ్లలో పార్లమెంట్, శాసన మండలి, శాసనసభకు వెళ్లేలా కేసీఆర్ అవకాశం ఇచ్చారని, ఆయన బిడ్డకు కూడా ఎంపీ టికెటిచ్చారన్నారు. అయినా పార్టీని వీడడం విశ్వాసఘాతుకం కాదా అని ప్రశ్నించారు. కొందరు ఐదు నెలలే అయింది కదా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎందుకు లొల్లి అంటున్నారని, వంద రోజుల్లోనే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలకు మార్చి 15 డెడ్‌లైన్ పెట్టుకుందని, అందుకే వాటిని యాదికి చేస్తున్నామన్నారు. వంద రోజుల అబద్ధాలకు పదేళ్ల నిజానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు అని పేర్కొన్నారు. పార్ట్–1 మాదిరిగానే పార్ట్–2 సీక్వెల్‌గా కాంగ్రెస్ మోసాలకు తెరలేపిందనే విషయాన్ని జనాల్లోకి తీసుకెళ్లేలా గులాబీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు కష్టపడితే ఎంపీ అభ్యర్థి సుధీర్ గెలుస్తాడన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే గులాబీ జెండా ఎగరాలని, బీఆర్‌ఎస్ గెలవాలన్నారు.

వరంగల్‌కు బీజేపీ చేసిందేముంది..

తాము యాదగిరిగుట్ట కట్టామని, దేవుడిని అడ్డం పెట్టుకొని అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడగలేదని కేటీఆర్ అన్నారు. బీజేపీ.. శ్రీరాముడి పేరు చెప్పుకొని ఇంటింటికీ అక్షింతలు పంపించి ఆశీర్వదించమని వేడుకుందన్నారు. మోదీ ఓట్ల కోసం అక్షింతలు పంపితే.. కేసీఆర్ మూడున్నర కోట్ల టన్నుల బియ్యం దేశానికి పంపించాడన్నారు. శ్రీరాముడితో పంచాయితీ లేదని, రాముడికి మొక్కుతాం.. బీజేపీని ఓట్లతో తొక్కుతామన్నారు. కాగా, అంతకుముందు రుణమాఫీపై సీఎం రేవంత్ మాటలను కార్యకర్తలకు వీడియో రూపంలో ప్రొజెక్టర్ ద్వారా చూపారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్లా ధర్మారెడ్డి, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు సారయ్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కడియంకు వాళ్ల అయ్య పేరు తెలుసా: తాటికొండ రాజయ్య

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వాళ్ల అయ్యపేరు తెలుసా అని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి, ఆయన సోదరుడికి డీఎన్‌ఏ పరీక్షలు చేస్తే తెలుస్తుందన్నారు. శ్రీహరి నకిలీ దళితుడని పేర్కొన్నారు. మంత్రి పదవులు చేపట్టిన కడియం అవినీతికి పాల్పడి దేశ విదేశాల్లో ఆస్తులు సంపాదించాడని ఆరోపించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందన్నారు. ఇప్పటికే రేవంత్‌పై ఆ పార్టీ సీనియర్‌లు గుర్రుగా ఉన్నారన్నారు.

ఎక్కడా కనిపించని మేయర్

బీఆర్‌ఎస్ వరంగల్ తూర్పు నియోజకవర్గ సమావేశానికి బల్దియా మేయర్ గుండు సుధారాణి డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. సమావేశం బ్యానర్‌పై కూడా మేయర్ ఫొటో కనిపించలేదు. ఇంతకు ఆమె పార్టీలో ఉన్నట్టా, లేనట్టా అని అక్కడున్న కార్యకర్తలు గుసగుసలాడడం కనిపించింది. కాగా, ఆమె గతంలోనే కుమారుడితో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే.

పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పరకాల: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 13న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పరకాలలో రాజీపేట అంబేడ్కర్ భవన్‌లో, ఉర్దూ మీడియం పాఠశాలలో 47, 48, 50 పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ తనిఖీ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన సామగ్రితో పాటు ఈవీఎంలను భద్రపర్చేందుకు సిద్ధం చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ చాంబర్‌లో అధికారులతో సమావేశమైన కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పరకాల ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహ, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

రేపట్నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ఓటర్లకు ఈనెల 25 నుంచి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిధి అసెంబ్లీ సెగ్మెంట్ల పోలింగ్ కేంద్రాల్లో జరిగిన మార్పుల వివరాల జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు వాటి ప్రతులు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ఓటరు సమాచారం స్లిప్పులు బీఎల్‌ఓల ద్వారా ప్రతీ ఓటరుకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈప్రక్రియపై ఆర్డీఓలు స్థానిక తహసీల్దార్ల ద్వారా శిక్షణ అందించాలన్నారు. మే 8వ తేదీలోగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మారిన పోలింగ్ కేంద్రాల వివరాల్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు తెలియజేయాలని సూచించారు. వరంగల్ పశ్చిమ, పరకాల ఆర్డీఓ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు వెంకటేశ్, నారాయణ, పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమారాణి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, రావు అమరేందర్‌రెడ్డి, శ్యాంసుందర్, మణి, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య నగర్‌లో నిత్య పెళ్లికొడుకు

- ఇప్పటికే మూడు వివాహాలు
- తాజాగా మరో యువతితో ప్రేమాయణం
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితుల వేడుకోలు



మాట్లాడుతున్న సారిక తల్లిదండ్రులు



రాజేశ్

వరంగల్: గ్రేటర్ వరంగల్ 14 డివిజన్ సుందరయ్య నగర్‌కు చెందిన మద్ది రాజేశ్ నిత్య పెళ్లికొడుకు అవతారమెత్తాడు. ఒకరికి తెలియకుండా మరొకరిని వివాహాలు చేసుకుని వేర్వేరుగా కాపురాలు పెట్టాడు. మూడు పెళ్లిళ్లు చేసుకున్న రాజేశ్ తాజాగా మరో యువతితో ప్రేమాయణం సాగిస్తున్నాడు. దీంతో మోసపోయామని తెలిసిన బాధిత మహిళలు, వారి కుటుంబ సభ్యులు రాజేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మూడు పెళ్లిళ్ల ఫొటోలు మీడియాకు విడుదల చేశారు. మంగళవారం సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధిత మహిళ తల్లిదండ్రులు నిడిగొండ సునీత, శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుందరయ్య నగర్‌కు చెందిన రాజేశ్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తూ 2022 ఫిబ్రవరిలో నగరంలోని చార్‌బౌలి ప్రాంతానికి చెందిన సుమప్రియను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆమెపై మోజు తీరిన తర్వాత అదే ఏడాది మే నెలలో హైదరాబాద్‌కు చెందిన శ్రావణిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో కొన్నాళ్లు కాపురం చేశాక సుందరయ్య నగర్‌కు వచ్చి అదే ప్రాంతానికి చెందిన నిడిగొండ సారికతో ప్రేమాయణం సాగించి ఈ ఏడాది ఫిబ్రవరిలో హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో మూడో వివాహం చేసుకున్నాడు. రాజేశ్ తెలివిగా ముగ్గురిని వేర్వేరుగా మూడు చోట్ల అద్దెకు ఉంచాడు. తాజాగా కరుణ అనే అమ్మాయితో తిరుగుతుండడంతో సుమప్రియ, సారిక తల్లిదండ్రులు ఆరా తీయగా రాజేశ్ గతంలో చేసుకున్న పెళ్లిళ్ల గురించి తెలిసింది. సుందరయ్యనగర్‌కు వచ్చిన రాజేశ్‌ను నిలదీయగా వారి కళ్లు కప్పి అక్కడి నుంచి పరారయ్యాడని సారిక తల్లిదండ్రులు తెలిపారు. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రేమ, పెళ్లిళ్ల పేరుతో అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటున్న రాజేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

పరకాలలో కిడ్నాప్ డ్రామా!

- అప్పు ఇచ్చిన వ్యక్తిని బెదిరించేందుకు భర్తను ఇంట్లో బంధించిన భార్య
- ఏమీ తెలియదన్నట్లు పరకాల పోలీసులకు ఫిర్యాదు

పరకాల: భర్తను ఇంట్లో బంధించి.. అప్పు ఇచ్చిన వ్యక్తే తన భర్తను కిడ్నాప్ చేశాడంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. విచారణలో.. అతడు ఇంట్లోనే బంధించి ఉండడం చూసిన పోలీసులు అవాక్కయ్యారు. ఈఘటన పరకాలలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పరకాల పట్టణంలోని ఓ బేకరి యజమాని ఫైర్ స్టేషన్ ఎదురుగా ఉన్న వెదురుబొంగుల వ్యాపారికి 2016లో రూ.7లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఇచ్చిన అసలుకు రూ.2లక్షల వడ్డీ చెల్లించాలని సదరు వ్యాపారిపై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీన్ని వ్యాపారి పట్టించుకోకపోవడంతో ఇంటిని మార్ట్‌గేజ్ చేయించాలని కోరాడు. అయినప్పటికీ వారిలో పట్టింపులేకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా.. సివిల్ కేసు ఇది.. కోర్టులో పరిష్కరించుకోవాలని సలహా ఇచ్చారు. దీంతో అప్పు ఇచ్చిన బేకరీ యజమాని మధ్యవర్తుల ద్వారా వ్యాపారితో కొత్తగా ప్రామిసరీ నోట్ రాయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వ్యాపారి భార్య తన భర్తతో గొడవపడి ఇంట్లోనే ఓ గదిలో బంధించి తాళం వేసింది. ఏమీ తెలియదన్నట్లు తన భర్తను అప్పు ఇచ్చిన వ్యక్తితోపాటు మరికొందరు కలిసి కిడ్నాప్ చేశారంటూ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు విచారణ జరుపుతుండగా భర్త ఇంట్లోనే ఉన్నట్లు తెలియడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. భర్త కిడ్నాప్ డ్రామాపై ఉన్నతాధికారులు ఆమెపై సీరియసయ్యారు. పోలీసులను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసిన సదరు మహిళపై కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

ఒకటి నుంచి వేసవి శిబిరాలు

క్రీడల అధికారి సత్యవాణి

కాశిబుగ్గ : వరంగల్ జిల్లాలో మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి మంగళవారం తెలిపారు. క్యాంపుల నిర్వహణ కోసం 19 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

వంగర పీహెచ్‌సీ పరిశీలన



పీహెచ్‌సీలో అందుతున్న సేవల గురించి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం వంగర పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మంగళవారం సందర్శించారు. పీహెచ్‌సీలో అందించే ఆరోగ్య మహిళా క్లినిక్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, వడదెబ్బ తగలకుండా వైద్యులు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న నేపథ్యంలో కూలీలకు అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచాలని సిబ్బందికి సూచించారు. వడదెబ్బ తగలకుండా కూలీలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైద్యులు రహమాన్, రుబీన, దినేశ్‌కుమార్, రమేశ్, కేఎల్‌ఎన్ స్వామి, మౌనిక, సుధీర్ తదితరులు ఉన్నారు.

మామునూరు ముందుకే!

రంగంలోకి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా

- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలతో ప్రత్యేక సర్వే
- ల్యాండింగ్, టేకాఫ్ తీరును పరిశీలించిన సిబ్బంది
- కొత్తగా 2,300 మీటర్ల పొడవుతో రన్‌వే ఏర్పాటు



సర్వే కోసం మామునూరుకు వచ్చిన హెలికాప్టర్లు

సాక్షి, వరంగల్: విమానంలో చక్కర్లు కొట్టాలన్న వరంగల్ వాసుల కలను నెరవేర్చే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు భూమి సేకరించి ఇచ్చే విషయంలో ఏళ్లుగా జాప్యం అవుతూ వచ్చినా.. గతేడాది ఆగస్టు 10న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పుడు విమానాశ్రయ ప్రాథమిక భూ సర్వే కోసం ఇండియాన్ ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్లు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. మామునూరు నుంచి ఇతర ప్రాంతాలకు రోజువారీగా విమానాలు చక్కర్లు కొట్టాయి. దాదాపు రెండు వారాలపాటు ఇక్కడ ఎయిర్‌స్ట్రిప్‌లో 1,400 మీటర్ల పొడవైన రన్‌వేపై ల్యాండ్ అయ్యాయి. ఇక్కడి నుంచి విమానాలు టేకాఫ్ తీసుకున్నాయి. విమానాల రాకపోకలకు స్థలం అనువుగా ఉందా లేదా? అని క్షేత్రస్థాయిలో ఇలా సిబ్బంది సర్వే చేసి సదరు నివేదికను ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు అందించేందుకు సిద్ధమయ్యారు. దీని ఆధారంగా మామునూరు ఎయిర్‌పోర్ట్ నూతన నిర్మాణం ప్రారంభమై.. ఓరుగల్లు వాసులకు అందుబాటులోకి రానుంది. స్థల సేకరణ, విమాన రాకపోకల పరిశీలన పూర్తవడంతో ఇక ఏ అడ్డంకి ఉండకపోవచ్చు.

ఎయిర్‌పోర్టు సిబ్బంది క్వార్టర్ల నిర్మాణం సైతం

దశాబ్దాల క్రితమే మామునూరు విమానాశ్రయంలో 1,400 మీటర్ల పొడవైన రన్‌వే ఉంది. దాని పక్కనే గ్లైడర్స్ దిగేందుకు అప్పట్లో మరో చిన్న రన్‌వే నిర్మించారు. ప్రధాని మోదీ పర్యటన, మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన సమయంలో ఈఎయిర్ ఫీల్డ్‌నే అధికారులు ఉపయోగించారు. ఇప్పుడు ఇండియా ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్లు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించాయి. విమానాల ల్యాండింగ్, టేకాఫ్ ఇతర అవసరాలను ఆధారంగా చేసుకొని 2,300 మీటర్ల పొడవుతో ఒకటే రన్‌వే కొత్త విమానాశ్రయం కోసం సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. రన్‌వే విస్తరణ, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సర్వీసెస్‌కు ఈ అదనపు భూమి అవసరమవుతోంది. ఎయిర్‌పోర్టు సిబ్బంది క్వార్టర్లను మరో చోట నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. భూమిని సేకరించి అథారిటీకి అప్పగించడంతో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని సంబంధిత అధికారులు అంటున్నారు.

నిరీక్షణకు తెర పడే దిశగా..

చిన్న నగరాలను రాష్ట్ర రాజధానులు, దేశ రాజధానులతో కలిపేందుకు కేంద్రం 2016లో ఉడాన్ (ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్) పథకం కింద మామునూరు విమానాశ్రయాన్ని 2022 సెప్టెంబర్‌లో ఎంపిక చేసింది. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, మామునూరు విమానాశ్రయాన్ని 'పర్యాటక ప్రాంతాలకు సమీపంలో ఉన్న విమానాశ్రయాల' కింద ఉడాన్ పథకం 5.0లో చోటు కల్పించింది. దేశం మొత్తం 54 పొటెన్షియల్ ఎయిర్‌స్ట్రిప్‌లను కేంద్రం గుర్తించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వరంగల్ ఎయిర్‌స్ట్రిప్ పరిధిలో 706 ఎకరాల భూమి ఉంది. ప్రాంతీయ విమానాశ్రయంగా అభివృద్ధికి ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ ప్రకారం ఫేజ్–1 కింద 179.41 ఎకరాలు, ఫేజ్–2 కింద 264.45 ఎకరాలు భూమి సేకరించి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఇందులో భాగంగా 253 ఎకరాలు కేటాయిస్తూ.. గతేడాది ఆగస్టు 10న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏఏఐ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేశారు. విమానాల రాకపోకలను నిశితంగా గమనించి ఓ నివేదికను సిద్ధం చేశారు. దీన్ని త్వరలోనే కేంద్రానికి సమర్పించి విమానాశ్రయ ఏర్పాటుకు అడుగులు పడేలా చేయనున్నారు.

ఐదో రోజు ఐదు నామినేషన్లు..

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రెండు సెట్లు దాఖలు
- ఇప్పటి వరకు 13 మంది అభ్యర్థులు.. 19 సెట్లు..


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత

మహబూబాబాద్: మానుకోట పార్లమెంట్ నియోజకవర్గానికి ఐదో రోజు ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆర్వో కార్యాలయంలో ఆర్వో, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు,. సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్లు నాగజ్యోతి, ఆంగోతు బిందు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా ప్రేమ్‌లాల్, ఆదివాసీ జేఏసీ నాయకుడు చందా లింగయ్య, శ్యామల నాయక్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నుంచి మోకాళ్ల మురళీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. వారితో పాటు ఇంతకుముందు నామినేషన్ వేసిన ఆధార్ పార్టీ అభ్యర్థి రఘునాయక్, స్వతంత్ర అభ్యర్థి ఎర్రయ్య మరో సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. కాగా, మంగళవారం(ఈనెల 23న) ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ వేయగా 8 సెట్లు దాఖలయ్యాయి. (ఇంతకు ముందు వేసిన ఇద్దరు అభ్యర్థులు కూడా నామినేషన్‌లు దాఖలు చేశారు). కాగా, ఇప్పటి వరకు 13 మంది అభ్యర్థులు నామినేషన్ వేయగా 19 సెట్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు అదనపు కలెక్టర్లు ఎం డేవిడ్, లెనిన్ వత్సల్‌టోప్పో, తహసీల్దార్లు పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంట్‌కు ఏడుగురు అభ్యర్థులు.. తొమ్మిది నామినేషన్లు

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ పార్లమెంట్ స్థానానికి మంగళవారం (ఐదో రోజు) ఏడుగురు అభ్యర్థులు 9 నామినేషన్లు దాఖలు చేశారు. విదుతలై చిరుతైగల్ కచ్చి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ రెండు సెట్ల నామినేషన్లు , ఎల్లందుల శోభన్‌బాబు (స్వతంత్ర) రెండు సెట్ల నామినేషన్లు, పోగుల అశోక్ (స్వతంత్ర), పోతరాజు నర్సింహరాజు (స్వతంత్ర), కుమ్మరి కన్నయ్య (స్వతంత్ర), కొంగర అనిల్‌కుమార్ (స్వతంత్ర), చిలుముల సుజాత (స్వతంత్ర) ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్యకు అందజేశారు. కాగా, ఇప్పటి వరకు మంగళవారం నాటికి (ఐదు రోజుల్లో) మొత్తం 26 మంది అభ్యర్థులు 31 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి, పాల్గొన్న నాయకులు

న్యూశాయంపేట: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సీపీఐ మద్దతు తెలిపింది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలు కలిసి మంగళవారం హనుమకొండ బాల సముద్రంలోని సీపీఐ కార్యాలయానికి విచ్చేశారు. సీపీఐ జిల్లా, మండల కార్యదర్శులు ముఖ్యనాయకులతో సమావేశమై మే 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతు ఇవ్వాలని కోరారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను గమనించి రాష్ట్రంలో ఒక్క స్థానం ఇవ్వకున్నా ఇండియా కూటమికి మద్దతు ఇచ్చేందుకు సీపీఐ ముందుకు రావడం అభినందనీయమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో నాయకులు కర్రె భిక్షపతి, మేకల రవి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, రాజ్‌కుమార్, విశ్వేశ్వర్‌రావు, బాషుమియా, ఎల్లేశ్, శ్రీనివాస్, సదాలక్ష్మి, రమేశ్, సుగుణ, అక్బర్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా



కాజీపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ శాఖ రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అందులో క్రియాశీలకంగా ఉన్న వ్యక్తులను గుర్తించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రౌడీషీటర్లు ప్రస్తుతం చేస్తున్న పని వివరాలతో పాటు కుటుంబ జీవనం, నివాస ప్రాంతం, సెల్‌ఫోన్ నంబర్లు ఇప్పటికే నమోదు చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్లకు క్రమం తప్పకుండా పిలిపించి ఎన్నికల సమయంలో ఎలాంటి అలజడులకు కారణం కావొద్దని హెచ్చరిస్తున్నారు. ఎన్నికల ప్రచార, ఇతర ప్రక్రియల్లో హడావుడి చేయడం, ఓటర్లను ప్రభావితం చేయడానికి యత్నించడం, భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కాజీపేట ఏసీపీ తిరుమల్ హెచ్చరించారు.

అధికార పార్టీకే పట్టం..

మానుకోట పార్లమెంట్‌లో ఓటర్ల విలక్షణ తీర్పు

- ఏ ఎన్నికలైనా రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ అభ్యర్థులదే విజయం
- ఇప్పుడు ఏం జరుగుతుందోనని చర్చ..





సాక్షి, మహబూబాబాద్ : ఉపఎన్నిక, లోక్‌సభ, అసెంబ్లీ.. ఇలా ఏ ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే మానుకోట పార్లమెంట్ స్థానం నుంచి అదే పార్టీకి చెందిన అభ్యర్థి విజయం సాధించడం ఆనవాయితీగా వస్తోంది. 1957లో తొలిసారి మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికలు మొదలు.. 2019లో జరిగిన ఎన్నికల వరకు అధికార పార్టీ అభ్యర్థులే ఇక్కడ ఎంపీగా గెలుపొంది పార్లమెంట్‌కు వెళ్తున్నారు. అయితే గతం వేరు.. ఇప్పుడు వేరు.. ఈ ఎన్నికల్లో ఫలితాలు గతానికి భిన్నంగా ఉంటాయని విపక్ష నాయకులు చెబుతుండగా.. అధికార పార్టీ అభ్యర్థే తిరిగి గెలుస్తారని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నాటి నుంచి నేటి వరకు..

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో జరిగిన ఎన్నికల్లోనే మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ ఏర్పడింది. అప్పటి నుంచి 1962 ఎన్నిక, తర్వాత 1965 ఉప ఎన్నిక వరకు మహబూబాబాద్ పేరుతోనే ఎన్నికలు నిర్వహించారు. అనంతరం జరిగిన పునర్విభజనలో మహబూబాబాద్ పార్లమెంట్ పేరును భద్రాచలం సెగ్మెంట్‌గా మార్చారు. 1967 నుంచి 2004 ఎన్నికల వరకు భద్రాచలంగా ఉన్న పార్లమెంట్ స్థానం 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన తర్వాత తిరిగి మహబూబాబాద్ సెగ్మెంట్‌గా ఏర్పడింది.

అధికార పార్టీ అభ్యర్థే గెలుపు..

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే మానుకోట పార్లమెంట్ నుంచి అదే పార్టీ అభ్యర్థి గెలవడం ఆనవాయితీగా వస్తోంది. 1957లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 105 స్థానాలు ఉండగా.. 68 స్థానాలు గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. పీడీఎఫ్-22, స్వతంత్రులు-12 మంది గెలుపొందారు. తొలిసారి నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రులుగా ఉన్నారు. అప్పుడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఇ.ఎం.రావు సమీప పీడీఎఫ్ అభ్యర్థి ఎస్.రామనాథంపై గెలుపొందారు. తర్వాత 1962 ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం 300 సీట్లకు గాను కాంగ్రెస్ పార్టీ-177, సీపీఐ-51, స్వతంత్ర పార్టీ-19, ఇండిపెండెంట్లు-51 మంది గెలుపొందారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ సీఎంలుగా నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందారెడ్డి పనిచేశారు. అదే సమయంలో మహబూబాబాద్ పార్లమెంట్ నుంచి మళ్లీ ఇ.ఎం.రావు సమీప సీపీఐ అభ్యర్థి టీ.ఎస్. రావుపై గెలుపొందారు. అదేవిధంగా 1965లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం సురేందర్‌రెడ్డి సమీప సీపీఎం అభ్యర్థి మద్దికాయల ఓంకార్‌పై గెలిచారు. తర్వాత 2009లో పునర్విభజన తర్వాత తిరిగి మహబూబాబాద్ పార్లమెంట్ నియోకవర్గం మళ్లీ ఏర్పడింది. అప్పుడు 2009 ఎన్నికల్లో రాష్ట్రంలో 294 సీట్లకుగాను కాంగ్రెస్-156, టీడీపీ-92, పీఆర్‌పీ-18, టీఆర్ఎస్-10 సీట్ల చొప్పున గెలుపొందాయి. అప్పుడు కాంగ్రెస్ పార్టీ సీఎంలుగా వైఎస్ రాజశేఖరరెడ్డి, కొణిజేటి రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలు పనిచేశారు. అప్పుడు పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన పోరిక బలరాం నాయక్ సమీప సీపీఐ అభ్యర్థి కుంజ శ్రీనివాసరావుపై గెలిచారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలిసారి 2014లో ఎన్నికలు జరగగా మొత్తం 119 సీట్లకు గాను టీఆర్ఎస్-63, కాంగ్రెస్-21, టీడీపీ-15, ఎంఐఎం-7, బీజేపీ-5, వైసీపీ-3, ఇతరులు-5 గెలవగా టీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన సీతారాం నాయక్ సమీప కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌పై గెలిచారు. 2018 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలవగా, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పుడు 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాలోత్ కవిత, సమీప కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌పై గెలిచారు. అదే విధంగా 2024లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్-64, బీఆర్ఎస్-39, బీజేపీ-8, ఎంఐఎం-7, సీపీఐ-1చొప్పున గెలిచారు. ఇందులో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లల్లో ఆరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. భద్రాచలంలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు.

మహబూబాబాద్ పార్లమెంట్ ఫలితాలు

ఎన్నిక	గెలుపు	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
1957	ఇ.ఎం.రావు	కాంగ్రెస్	ఎస్. రామనాథం	పీడీఎఫ్	7,256
1962	ఇ.ఎం.రావు	కాంగ్రెస్	టీ.ఎస్.రావు	సీపీఐ	13,576
1965(ఉప)	ఆర్.సురేందర్ రెడ్డి	కాంగ్రెస్	ఎం. ఓంకార్	సీపీఎం	1,17,337
2009	పి.బలరాంనాయక్	కాంగ్రెస్	కుంజ శ్రీనివాస్	సీపీఐ	68,957
2014	సీతారాం నాయక్	టీఆర్ఎస్	బలరాంనాయక్	కాంగ్రెస్	34,992
2019	మాలోత్ కవిత	టీఆర్ఎస్	బలరాంనాయక్	కాంగ్రెస్	1,46,663


సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ..

- మాటల యుద్ధం
- కొట్లాడుకుందామా రండి : మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత తేల్చుకుందాం : ఎమ్మెల్సీ రవీందర్‌రావు
- వర్గపోరు మరోసారి బహిర్గతం

మహబూబాబాద్: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మధ్య వర్గపోరు మరోసారి బహిర్గతమైంది. చివరి దేనికైనా సిద్ధమే అనే వరకు వారి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఎంపీ మాలోత్ కవిత నామినేషన్ వేసిన అనంతరం జిల్లా కేంద్రంలో మంగళవారం పార్టీ మానుకోట పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందు మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌కు అవకాశం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలో చేసిన పొరపాట్లు పునరావృతం కావొద్దన్నారు. పార్టీకి వెన్నుపోటు పొడవొద్దని, కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్సీ వర్గానికి చెందిన జెర్రిపోతుల వెంకన్న నిలబడి ప్రతిసారి తల్లి పాలు తాగి రొమ్ము గుద్దుతున్నారని మాట్లాడుతున్నారు.. ఏంటి సంగతి అన్నారు. వెంటనే ఎమ్మెల్సీ కూడా అందుకు తన దగ్గర జవాబు ఉందన్నారు. అందుకు మాజీ ఎమ్మెల్యే.. ఏది మరి కొట్లాడుకుందాం రండి అన్నారు. వెంటనే ఎంపీ అభ్యర్థి, రాజ్యసభ సభ్యులు జోక్యం చేసుకుని విషయం డైవర్ట్ చేశారు. ఎమ్మెల్సీ రవీందర్‌రావు మాట్లాడుతూ గత ఎన్నికల గెలుపు ఓటములపై సమీక్షలు జరగలేదన్నారు.వెంటనే పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయన్నారు. వర్గ విభేదాలు ఏమున్నా ఈ ఎన్నికల తర్వాత తేల్చుకుందామని మాజీ ఎమ్మెల్యేను ఉద్దేశించి అన్నారు. నామినేషన్ సమయంలో కూడా ఎమ్మెల్సీ అనుచరులు ఎమ్మెల్సీ క్యాంపు నుంచి, మాజీ ఎమ్మెల్యే అనుచరులు తన ఇంటి నుంచి, ఎంపీ అనుచరులు తన క్యాంపు కార్యాలయం నుంచి వచ్చారు. ఇలా వర్గపోరు నేటికీ కొనసాగుతూనే ఉంది.

అదనపు పోలింగ్ కేంద్రం మంజూరు

- కలెక్టర్ పి.ప్రావీణ్య



కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ రెవెన్యూ జిల్లాకు ఒక ఆగ్జిలరీ (అదనపు) పోలింగ్ కేంద్రం మంజూరు, రెండు పోలింగ్ కేంద్రాలు మార్పులు చేయాలని కోరుతూ పంపిన ప్రతిపాదనలకు కేంద్ర ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించి మంజూరు చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వర్ధన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లోని వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామ మండల పరిషత్ పాఠశాలలోని రంధాన్ తండా 233 పోలింగ్ కేంద్రంలో 1129 ఓటర్లు ఉండగా, 233/ఏ చంద్రు తండాకు ఆగ్జిలరీ పోలింగ్ కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. రాంధాన్ తండా పోలింగ్ కేంద్రానికి సంబంధించి మొత్తం 1129 ఓటర్లు ఉండగా అందులో నుంచి 233/ఏ పోలింగ్ కేంద్రంలోని 668 ఓటర్లను కుదించి మొత్తం 461 ఓటర్లతో ఎంపీపీఎస్ చంద్రుతండాకు ఆగ్జిలరీ కేంద్రం కేటాయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లోని సన్నూరు మండల పరిషత్ పాఠశాలలోని 231 నంబర్ పోలింగ్ కేంద్రాన్ని వెంకటేశ్వర్లపల్లె గ్రామ పంచాయతీకి, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్‌లోని అనంతారం మండల పరిషత్ పాఠశాలలోని 156 నంబర్ పోలింగ్ కేంద్రం కార్యాలయాన్ని అనంతారం గ్రామ పంచాయతీకి మార్పు చేసినట్లు వివరించారు.

పట్టుబడిన రూ.44.14 లక్షల నగదు విడుదల



కాశీబుగ్గ సెంటర్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు చెక్ పోస్టుల్లో, ఫ్లయింగ్ స్కాడ్‌లు తనిఖీలు జరిపిన సమయంలో రూ.50 వేల నగదు కంటే ఎక్కువ ఎలాంటి ఆధారాలు లేని 25 కేసులలో పట్టుబడగా సీజ్ చేసిన రూ.44,14,780 నగదును విడదల చేసినట్లు ఎన్నికల గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ గూడూరు రాంరెడ్డి మంగళవారం తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ నగదు గాని, బంగారు, వెండి తరలిస్తే సరైన ఆధారాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ మానిటరింగ్ కమిటీ ఉంటుందని, ఇందుకు సంబంధించిన నగదు రిలీజ్ కోసం 7901616025 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఓబీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న బీజేపీ

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ
- హంటర్‌రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఓబీసీల సమ్మేళనం


మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

హన్మకొండ: ఓబీసీల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఓబీసీల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతల్ని రూపుమాపడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచి తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రతిపక్షాల్లో మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడే లేరని, గత పదేళ్లుగా మోదీ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశం కోసం పనిచేశారన్నారు. అలాంటి నాయకుడిని మరోసారి ప్రధానిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. 'మోదీ ప్రధాని అయినప్పుడే.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని.. కానీ కేసీఆర్ ఒక్కరోజు కూడా సచివాలయానికి రాలేదని ఫాంహౌజ్‌లో గడిపారని తూర్పారబట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ పార్లమెంట్ ప్రభారి వి.మురళీధర్‌గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు బెజ్జంకి పూర్ణాచారి, వినయ్, సంజయ్ గనాటే, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంపై మోదీకి చిత్తశుద్ధి లేదు

- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి


మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ మురళి

కేయూ క్యాంపస్ : విద్యారంగంపై మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని, నూతన జాతీయ విద్యా విధానంతో అశాస్త్రీయ విధానాలు చొప్పిస్తున్నారని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. మంగళవారం కేయూలో 'నూతన జాతీయ విద్యా విధానం -2020 విద్యార్థులపై ప్రభావం, పర్యావసనాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ 10 సంవత్సరాల పాలనలో అదానీ, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు సేవచేస్తూ తరించడమే సరిపోయిందని విమర్శించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయం గాలి కొదిలేశారన్నారు. విద్యావేత్తలు, మేధావుల అభిప్రాయాలు తీసుకోకుండా నూతన జాతీయ విద్యావిధానం -2020ని తీసుకువచ్చామని దుయ్యబట్టారు. పాఠ్యపుస్తకాల్లో లౌకిక, ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాలు తీసివేసి అశాస్త్రీయ, మూఢత్వ భావాలను ప్రవేశపెట్టి విద్యార్థుల మెదళ్లను విషతుల్యం చేస్తున్నారని మండిపడ్డారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 2.5శాతం నిధులు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజాషా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణీయ హైందవ సంస్కృతి పేరిట స్త్రీజాతిని బందీని చేసి వంటింటికే పరిమితం చేసే చర్యలకు పూనుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి అధ్యక్షత వహించారు. కేయూ రిటైర్డ్ ఆచార్యులు కె వెంకటనారాయణ, డాక్టర్ పి జగదీశ్వర్, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు పృథ్వీ, నామాల ఆజాద్, ఖలేదా ఫర్వీ న్, స్కైబాబా, వెంకటరెడ్డి, మాలోత్ రాజేష్‌నాయక్, నర్సింహారావు, శివ, రంజిత్, మహేష్, పృథ్వీ, గణేష్,అశోక్ పాల్గొన్నారు.

పంచముఖ వీరాంజనేయుడికి అభిషేకాలు



హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం చైత్రశుద్ధ పౌర్ణమి హనుమాన్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని పంచముఖ ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి సుప్రభాతసేవ, రుద్రేశ్వరస్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పంచముఖ ఆంజనేయస్వామి ఉత్సవమూర్తికి పసుపు, కుంకుమలతో, నవరసాలతో, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. జిల్లేడు పూలతో అర్చన చేసి అరటిపండ్లు, బెల్లంపాయసం నివేదన చేశారు.

గమ్యం చేరాక.. కబళించిన మృత్యువు

- ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే యువకుడి మృతి..
- పలువురికి తీవ్ర గాయాలు
- బుధరావుపేటలో ఘటన


సులేమాన్(ఫైల్)


యాకూబీని ఎంజీఎం తరలిస్తున్న వైద్య సిబ్బంది

ఖానాపురం: వారంతా ఒకే గ్రామానికి చెందిన వారు. వేరే ప్రాంతంలో వివిధ పనులు ముగించుకుని ఆటోలో ఎక్కి గమ్యం చేరుకున్నారు.. కొద్ది నిమిషాల్లో ఇంటికి చేరుకుని కుటుంబీకులతో హాయిగా గడిపేవారు. కానీ ఇంతలోనే ఘోరం జరిగింది. రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు.. ఆ గ్రామస్తుల్లో ఓ యువకుడిని కబళించింది. అంతేకాకుండా పలువురిని గాయపరిచింది. మంగళవారం బుధరావుపేటలో జరిగిన ఈ ఘటనతో ఆయా కుటుంబాలతోపాటు గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం.. వ రంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామానికి చెందిన షేక్ సులేమాన్(32) అనారోగ్య కారణాలతో హనుమకొండలోని ఓ ఆస్పత్రికి వెళ్లి తిరుగుపయనమయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన చాంద్‌బీ, యాకూబీ, ఎలంశెట్టి సరిత, ఎలంశెట్టి రక్షిత్, బానోత్ రుత్విక్, గూడూరు మండలం మట్టెవాడకు చెందిన ఈక లక్ష్మి.. వివిధ పనుల నిమిత్తం నర్సంపేటకు వచ్చారు. పనులు ముగించుకున్న వీరంతా స్వగ్రామానికి వెళ్లడానికి నర్సంపేటలో బుధరావుపేటకు చెందిన పసునూరి సత్యనారాయణ ఆటో ఎక్కారు. ఆటో గమ్యానికి (బుధరావుపేట)చేరుకుంది. ఈ క్రమంలో సులేమాన్ ఆటో దిగి ముందుకు నడుస్తుండగా మిగతా వారు డబ్బు ఇచ్చి అందులో ఉన్న సామగ్రి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో నర్సంపేట నుంచి మహబూబాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఆగి ఉన్న ఆటోను వెనుక నుంచి ఢీకొని అదుపు తప్పి నడుచుకుంటూ వెళ్తున్న సులేమాన్‌ను ఢీకొంది. దీంతో సులేమాన్ అక్కడికక్కడే మృతి చెందగా కారు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. ఆటోను వేగంగా ఢీకొనడంతో బోల్తాపడింది. ఈ ఘటనలో అందులో ఉన్న సత్యనారాయణ, ఈక లక్ష్మితో పాటు ఆటో పక్కన ఉన్న యాకూబీ, చాంద్‌బీ, రుత్విక్, రక్షిత్, సరితకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందులో యాకూబీ పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం తరలించారు. సీఐ రాజగోపాల్, ఎస్సై రఘుపతి ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, సులేమాన్ ఇటీవలే పీహెచ్‌డీలో సీటు సాధించాడు. తమకు ఆసరా అవుతాడకున్న సమయంలో మృతి చెందడంతో ఆ కుటుంబం బోరున విలపించింది. కారులో ప్రయాణిస్తున్న ఇరువురు మహిళలు, ముగ్గురు పిల్లలు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారు డ్రైవర్ యూసుఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకున్నారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎంఓతో ఫోన్‌లో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎంపీపీ ప్రకాశ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహలక్ష్మి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

ములుగు రూరల్: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పంచోత్కులపల్లిలో జరిగింది. మహ్మద్‌గౌస్‌పల్లికి చెందిన చింతల రాజు(39) ఈ నెల 21వ తేదీన కడుపు నొప్పితో ములుగు ఏరియా ఆస్పత్రిలో చేరాడు. సోమవారం ఉదయం చూడగా ఆస్పత్రిలో కనిపించలేదు. ఈ క్రమంలో పంచోత్కులపల్లిలో మృతదేహం ఉందనే సమాచారం మేరకు మృతుడి తల్లి, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి ఆస్పత్రికి తరలించారు. కాగా, తన కుమారుడు వడదెబ్బతో మృతి చెందాడని మృతుడి తల్లి సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మంగళవారం తెలిపారు.

పలు రూట్లలో రైళ్ల రద్దు

కాజీపేట రూరల్ : సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో చేపట్టిన రోలింగ్ కారిడార్ బ్లాక్ ప్రోగ్రాంతో కాజీపేట జంక్షన్, వరంగల్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు స్థానిక రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ప్రయాణికులు గమనించాలని పేర్కొన్నారు.

రద్దయిన రైళ్లు ఇవే..

ఏప్రిల్ 29 నుంచి మే 10 వరకు, మే 16 నుంచి 22వ తేదీ వరకు గుంటూరు-సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (12706) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (17201) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-గుంటూరు (17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 28 , మే 5, 19వ తేదీల్లో తిరుపతి-సికింద్రాబాద్ (07481) పద్మావతి ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 29, మే 6, 20వ తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి (07482) పద్మావతి ఎక్స్‌ప్రెస్, మే 4, 11, 18వ తేదీల్లో హైదరాబాద్-నర్సాపూర్ (07631) ఎక్స్‌ప్రెస్, మే 5, 12, 19వ తేదీల్లో నర్సాపూర్-హైదరాబాద్ (07632) ఎక్స్‌ప్రెస్, ఏప్రిల్ 29 నుంచి మే 10, మే 16 నుంచి 22వ తేదీ వరకు విజయవాడ-సికింద్రాబాద్ (12713) శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ (12714) శాతవాహన ఎక్స్‌ప్రెస్, మే 3, 4వ తేదీల్లో వరంగల్-సికింద్రాబాద్ (07757) పుష్‌పుల్, సికింద్రాబాద్-కాజీపేట (07758) పుష్‌పుల్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.